


# కరపత్రం

SINCE 2014

ఆదివారం సెప్టెంబర్ 21 2025 | సంపుటి :0 | సంచిక :333 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4

## విదేశాలపై ఆధారపడడమే పెద్ద తప్పు



హెచ్ 1బీ వీసాలపై అమెరికా అధ్యక్షుడు లక్ష డాలర్ల దరఖాస్తు రుసుము విధించటంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. ఈ మేరకు శనివారం ట్రంప్ నిర్ణయంపై కీలక వ్యాఖ్యలు చేశారు. విదేశాలపై ఆధారపడటమే అన్నింటికన్నా పెద్ద శత్రువని మోదీ పేర్కొన్నారు. విదేశాలపై ఆధారపడొద్దని తాను ఎప్పటినుంచో చెబుతున్నానన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. 'మనమంతా కలిసి ఆ శత్రువును జయించాల్సిన అవసరం ఉంది. విదేశాలపై మనం ఎంతగా ఆధారపడితే మన దేశం అంతలా విఫలం అవుతుంది. మనమంతా కలిసి భారత్‌ను ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థలా మార్చాలి. ఇతరులతో కలిసి నడుద్దాం కానీ, ఆత్మాభిమానంతో బతుకుదాం. 140 కోట్ల మంది భవిష్యత్తును ఇతర దేశాల మీద వదిలేయబోం అని స్పష్టం చేశారు.

**అదే మనకు అతిపెద్ద శత్రువు విదేశాలపై ఎంతగా ఆధారపడితే అంతగా విఫలం అవుతాం ట్రంప్ వీసా ఛార్జీలపై ప్రధాని మోడీ పరోక్ష హెచ్చరిక**

2లో..



## రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి ఫోబియా..: రామచందర్‌రావు



2లో

## దసరా సమీపిస్తున్న వేళ.. భారీగా అక్రమ మద్యం పట్టివేత



2లో

# బతుకమ్మ పండగ..

## గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, సీఎం రేవంత్ శుభాకాంక్షలు




హైదరాబాద్: బతుకమ్మ పండగ నేపథ్యంలో ఆడబిడ్డలందరికీ సీఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు బతుకమ్మ ప్రతీక అని, ప్రకృతిని ఆరాధిస్తూ చేసుకునే గొప్ప పండగని పేర్కొన్నారు. కష్టసుఖాలను కలిసి పంచుకునే ప్రజల ఐక్యతకు నిదర్శనమని చెప్పారు. రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని గౌరమ్మను ప్రార్థించినట్లు వెల్లడించారు. గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ సైతం ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. గౌరీమాత అందరికీ ఆయుష్షు, ఆరోగ్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. కష్టాల నుంచి రక్షించి రాష్ట్ర ప్రజల జీవితాల్లో వెలుగులు నింపాలని బతుకమ్మను భారత రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ ప్రార్థించారు. ప్రజలకు పూల పండగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ అస్తిత్వం, సాంస్కృతిక జీవనానికి బతుకమ్మ ప్రతీకగా నిలిచిందన్నారు. ప్రపంచ సంస్కృతీ, సాంప్రదాయాల్లో తెలంగాణ ప్రత్యేకతను చాటుతోందని చెప్పారు. రాష్ట్ర సాధన ఉద్యమంలో తెలంగాణ అస్తిత్వ ఆకాంక్షలకు ప్రధాన సాంస్కృతిక వేదికగా నిలిచిందని గుర్తుచేసుకున్నారు.

## ట్రంప్ ఉత్తర్వులు..

### ఉమ్మడి ఏపీలోని సాఫ్ట్‌వేర్ ఉద్యోగులపై తీవ్ర ప్రభావం



హైదరాబాద్: హెచ్-1బీ వీసా రుసుం పెంచుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెలువరించిన ఉత్తర్వుల వల్ల భారతీయ టెక్ కంపెనీలకు తీవ్రనష్టం వాటిల్లే అవకాశం ఉందని తెలంగాణ ఐటీశాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.

వివరాలు 2 లో..

# రహదారి భద్రత పేరిట ప్రజలపైభారమా

## వాహనాలు కొంటే పన్ను వేయడమా రేవంత్సర్కార్ తీరుపై మండిపడ్డ కెటిఆర్



పెరిగిపోతున్న ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా చర్యలు తీసుకోవాలని సుప్రీంకోర్టు ఆదేశాలిస్తే వాటిని అమలు చేయాల్సింది పోయి, వాహన కొనుగోలుదారులపై భారం మోపడం దారుణమని కెటిఆర్ మండిపడ్డారు. ఇది ముఖ్యమంత్రి ప్రజావ్యతిరేక వైఖరికి నిదర్శనం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. రాష్ట్ర బడ్జెట్ నుంచి రోడ్ సేఫ్టీకి నిధులు కేటాయించి భద్రతా ప్రమాణాలను పెంచకుండా ఇలా అమాయక ప్రజలపై భారం మోపడం అత్యంత దారుణం అని కేటీ-ఆర్ మండిపడ్డారు. హైడ్రా వంటి దిక్కుమాలిన విధానాలతో ప్రభుత్వ ఆదాయాలకు గండికొట్టి, ఇప్పుడు ఆ లోటు-ను పూడ్చలేక సామాన్య ప్రజలపై విరుచుకుపడటం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

మిగతాద్ది 2 లో

## రాజకీయాల్లో ఎవరూ స్పేస్ ఇవ్వరు.. తొక్కుకుంటూ వెళ్లాల్సిందే: కవిత


కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచన తనకు లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు.

2లో



కరపత్రం
తెలుగు దిన పత్రిక
ఆదివారం సెప్టెంబర్ 21 2025

# వక్ఫ్ గ్రహణంలో భారత్ కీర్తి చంద్రికలు




భారత జాతీయ చట్టసభ పార్లమెంటు ఆమోదించిన ఒక చట్టంలోని వొక నిబంధనను సుప్రీంకోర్టు గానీ లేదా హైకోర్టు గానీ కొట్టివేస్తే అది ప్రభుత్వానికి గానీ, పార్లమెంటు సభ్యులకు గానీ ప్రతిష్ఠాకరమేనా? శాసన నిర్మాణ బాధ్యతలను వారు నిర్వర్తించిన తీరును ఆక్షేపించడమే కాదూ ఆ న్యాయ నిర్ణయం? ఒక బిల్లులోని నిబంధనలు రాజ్యాంగ నిర్దేశాలకు విరుద్ధంగా ఉన్నట్టయితే శాసన నిర్మాతలు ఆ బిల్లును తప్పక వ్యతిరేకిస్తారు. అయినా ప్రభుత్వం ఆ బిల్లును పార్లమెంటులో మళ్లీ ప్రవేశపెట్టి ఆమోదింప చేసుకోవచ్చు. అయినా ఉన్నత న్యాయస్థానాలు అంతిమంగా ఆ బిల్లును కొట్టివేస్తే అది ప్రభుత్వానికి ఎంత అవమానం, ఎన్ని తలవంపులు?! అంతకంటే అధ్వానకరమైన పరిస్థితిని పరిశీలనలోకి తీసుకోండి: పార్లమెంటులో ప్రవేశపెట్టిన బిల్లుకు తీవ్ర వ్యతిరేకత వస్తుంది. అప్పుడు ఆ బిల్లును సంయుక్త పార్లమెంటరీ సంఘం (జేపీసీ)కి పరిశీలనకు నివేదిస్తారు. జేపీసీలోని పలువురు సభ్యులు ఆ బిల్లు పట్ల తమ తీవ్ర అసమ్మతి తెలుపుతారు. పార్లమెంటు ఆమోదించేందుకు ఆ బిల్లు అర్హమైనది కాదని స్పష్టం చేస్తారు. సభ్యుల ఆక్షేపణలు, అభ్యంతరాలను తోసిపుచ్చి ప్రభుత్వం ఆ బిల్లును ఆమోదింప చేసుకుంటుంది. ఆ తరువాత ఉన్నత న్యాయస్థానాలు ఆ బిల్లులోని నిబంధనలను కొట్టివేయడమో లేక వాటి అమలును తాత్కాలికంగా నిలిపివేయడమో చేస్తాయి. ప్రభుత్వానికి ఇంతకంటే ఘోరమైన అవమానం మరేముంటుంది? న్యాయ మంత్రిత్వశాఖ విధి నిర్వహణా దక్షత ఎంత సమర్థంగా ఉన్నదో అది తెలియజేస్తుంది!

ఇదీ వక్ఫ్ (సవరణ) చట్టం–2025 కథ. సెప్టెంబర్ 15, 2025న ఆ చట్టంలోని కొన్ని కీలక నిబంధనలపై సుప్రీం స్టే విధించింది. అయినప్పటికీ ప్రభుత్వం గంభీరంగా తనను తాను అభినందించుకున్నది. 'ముస్లిమ్ పర్సనల్ లా'లోని ప్రధాన భాగాన్ని సంస్కరించేందుకు తాము చేసిన ప్రయత్నాలను సుప్రీంకోర్టు ఆమోదించిందని ప్రభుత్వం చెప్పుకున్నది. పార్లమెంటులో లేవనెత్తిన అనేక ప్రశ్నలను ఏప్రిల్ 5, 2025న ఇదే కాలమ్‌లో నేను రాసిన వ్యాసం ('ముస్లింలపై మరో దాడి!')లో ప్రస్తావించాను. విపక్షాలు లేవనెత్తిన ప్రశ్నలకు ప్రభుత్వం నుంచి సమాధానాలు రాలేదు. ఆ బిల్లులోని వివిధ నిబంధనలను ప్రభుత్వం మొండిగా సమర్థించుకున్నది అయితే మా ప్రశ్నలకు సుప్రీంకోర్టు మధ్యంతర సమాధానాలు ఇచ్చింది:

వక్ఫ్ సవరణ చట్టం కింద 'ఒక వక్ఫ్‌ను సృష్టించే వ్యక్తి తాను కనీసం ఐదు సంవత్సరాలుగా ఇస్లాంను అనుష్ఠానిస్తున్నానని నిరూపించుకోవాలి'. తాను ఇస్లాంను అనుసరిస్తున్నానని ఒక వ్యక్తి ఎలా 'నిరూపించాలి' అని మేము ప్రశ్నించాము. చట్టంలోని 3వ సెక్షన్‌లో 'ఆర్' అనే నిబంధనపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఆస్తిని వక్ఫ్‌గా ప్రకటించే ముందు ఐదేళ్ల పాటు ఇస్లాం మతాన్ని అనుసరించి ఉండాలన్న షరతుకు కొత్త నియమాలు రూపొందించేంతవరకు ఈ స్టే వర్తిస్తుందని కోర్టు పేర్కొంది. ఆ షరతుకు వర్తించే నియమాలను రూపొందించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉన్నది. ఇతర మతాల పర్సనల్ లాస్ (వివాహం, ఆస్తుల వారసత్వం మొదలైన కొన్ని వ్యక్తిగత విషయాలకు సంబంధించి ఆయా వ్యక్తులకు సంబంధించిన మతాచారం ప్రకారం వర్తించే శాసనపరంగా గుర్తింపు కలిగిన నియమ నిబంధనలు)లో ఇటువంటి నిబంధనేదీ లేదు.

వక్ఫ్‌గా ప్రకటించిన ఆస్తి ప్రభుత్వ ఆస్తి అవునో కాదో అనేది నిర్ణయించడానికి జిల్లా మెజిస్ట్రేట్‌కు అధికారం ఉన్న సెక్షన్‌ను కూడా సుప్రీంకోర్టు నిలిపివేసింది. పౌరుల వ్యక్తిగత హక్కులపై నిర్ణయం తీసుకోవడానికి జిల్లా మెజిస్ట్రేట్‌కు అనుమతి లేదని తెలిపింది. అది అధికారాల వికేంద్రీకరణను ఉల్లంఘిస్తుందని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. నిర్దిష్ట వక్ఫ్ ఆస్తి 'ప్రభుత్వ ఆస్తి అవునో కాదో నిర్ణయించేందుకు నియుక్తుడైన అధికారి నిర్ణయం తీసుకునేవరకు ఆ ఆస్తిని వక్ఫ్ ఆస్తిగా పరిగణించకూడదు. అది ప్రభుత్వ ఆస్తి అని ఆ అధికారి నిర్ణయిస్తే ఆ ప్రకారం అతడు రెవెన్యూ రికార్డులను సవరించాలి? అని చట్టం నిర్దేశించింది. అయితే ఇది తన సొంత వ్యవహారంలో ప్రభుత్వమే న్యాయమూర్తి పాత్ర వహించడం కాదా అని మేము ప్రశ్నించాము. సెక్షన్ 3సి లోని సబ్ సెక్షన్లు 2, 3, 4పై సుప్రీంకోర్టు స్టే విధించింది.

రెవెన్యూ రికార్డులు 'సవరించిన 'తరువాత వక్ఫ్ ఆస్తిగా పరిగణింపబడే హక్కును కోల్పోతుంది. కార్యనిర్వాహక చర్య ద్వారా వక్ఫ్ ఆస్తిపై హక్కును తొలగించడం కాదా అని మేము ప్రశ్నించాము. ఈ అంశంపై అప్పిలేట్ ట్రిబ్యునల్, సంబంధిత హైకోర్టు నిర్ణయం తీసుకునేంతవరకు రెవెన్యూ రికార్డుల సవరణను నిలిపివేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డులలోను, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్స్‌లోను ముస్లిమేతరులను నియమించవచ్చని, సీఈఓగా కూడా ముస్లిమేతరులను నియమించవచ్చని వక్ఫ్ సవరణ చట్టం నిర్దేశించింది. మరి హిందూమతానికి చెందిన ట్రస్టులో ముస్లిం లేదా హిందూయేతర వ్యక్తికి స్థానం కల్పించేందుకు వీలుగా ఇటువంటి నిబంధనలను సంబంధిత చట్టాలలో చేరుస్తారా అని మేము ప్రశ్నించాము. సుప్రీంకోర్టు సైతం ఇదే విషయాన్ని ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రాష్ట్ర వక్ఫ్ బోర్డుల్లోని 11 మంది సభ్యులలో ముస్లిమేతరుల సంఖ్య ముగ్గురికి మించకూడదని, కేంద్ర వక్ఫ్ కౌన్సిల్‌లోని 22 మంది సభ్యులలో ముస్లిమేతరులు నలుగురికి మించి ఉండకూడదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. సీఈఓగా ముస్లింను నియమించేందుకు అవసరమైన ప్రతి ప్రయత్నమూ చేయాలని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వక్ఫ్ (సవరణ) చట్టంపై మొత్తంగా కానీ లేదా కనీసం అందులోని కొన్ని కీలక నిబంధనలపై తాత్కాలిక స్టే ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతూ దాఖలైన దరఖాస్తుపై వాదనలను సుప్రీంకోర్టు మూడు రోజుల పాటు విన్నది. చట్టం అమలు నిలుపుదలకు దాఖలైన ఒక దరఖాస్తుపై మూడు రోజుల పాటు విచారణ జరపడం అసాధారణం. ఈ కేసు అంతిమ విచారణకు వచ్చినప్పుడు మరిన్ని వాదనలను సుప్రీంకోర్టు వినున్నది. సరే, ఈ లోగా ఈ ప్రభుత్వం తన హిందుత్వ అజెండాను మరింత ముందుకు తీసుకువెళుతూ మైనారిటీల ప్రయోజనాలకు విఘాతం కలిగించే నిర్ణయాలు తీసుకుంటుంది, చర్యలు చేపడుతుంది, సందేహం లేదు.

వక్ఫ్(సవరణ) చట్టంను కించిత్ పరిశీలిస్తే దాని దురుద్దేశం, మైనారిటీల పట్ల ద్వేషభావం ఇట్టే విశదమవుతుంది. ప్రభుత్వం నిష్ఠగా పాటించవలసిన రాజ్యాంగ అధికరణ 26 'మతపరమైన వ్యవహారాలను నిర్వహించుకునే హక్కు' అన్ని మతాలవారు తమ మతసంస్థలను స్వేచ్ఛగా నిర్వహించుకోవచ్చునని స్పష్టం చేస్తున్నది. ఆ అధికరణ ఇంకా నాలుగు విషయాలు పేర్కొంది. అవి: 1) సంస్థలను ఏర్పాటు చేసుకొనుటబీ 2) నిర్వహించుకొనుటబీ 3) సంస్థల కొరకై చర స్థిరాస్తులను సేకరించుకొనుటబీ 4) సేకరించిన ఆస్తుల నిర్వహణ, ఇవన్నీ మత స్వేచ్ఛలో అంతర్భాగాలు. ఈ హక్కులను నిర్వహించుకొనుటలో శాంతిభద్రతలను, నీతిని, ప్రజారోగ్యాన్ని భంగపరచరాదు. భారతదేశ మత, సాంస్కృతిక జీవనంలో విశిష్టమైన, విలక్షణమైన వైవిధ్యాన్ని సంరక్షించుకుని మరింత దృఢతరం చేసుకోదలిచినవారు మరీ ముఖ్యంగా హిందువులు వక్ఫ్ (సవరణ) చట్టానికి వ్యతిరేకంగా పోరాడాలి, పోరాడి తీరాలి. భారతదేశ జనాభాలో ముస్లిం మతస్తులు 20.20 కోట్ల మంది కాగా క్రైస్తవులు 3.20 కోట్ల మంది ఉన్నారని ఈ ఏడాది సాధికారిక అంచనాలు నిర్ధారించాయి. హిందూధర్మం ప్రపంచ అత్యంత పురాతన మతం కాగా క్రైస్తవం, ఇస్లాం ప్రపంచ వ్యాప్తంగా అత్యధికులు అనుసరించే మతాలుగా విలసిల్లుతున్నాయి. భారతీయులమైన మనం లౌకికవాదులమని, సహనశీలురమని ప్రగాఢంగా విశ్వసిస్తాం. అయితే ప్రపంచం మాత్రం భారత్‌ను భారత పార్లమెంటు చట్టాలు, భారత ప్రభుత్వ చర్యలు, భారత ప్రజల సామాజిక ప్రవర్తనారీతుల ప్రాతిపదికన చూస్తుంది. మన దేశం పట్ల అభిప్రాయాలు ఏర్పరచుకుంటుంది. ప్రపంచం దృష్టిలో భారత్‌కు ఇంతకు ముందున్న సమున్నత గౌరవ ప్రతిష్ఠలు వక్ఫ్ (సవరణ) చట్టంతో క్షీణించాయి.

# విదేశాలపై ఆధారపడడమే పెద్ద తప్పు

మొదటి పేజీ తరువాయి

ప్రధాని నరేంద్ర మోదీ శనివారం గుజరాత్‌లో పర్యటించారు. ఈసందర్భంగా అక్కడ నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. మనకు ప్రధాన శత్రువులు ఎవరూ లేరని, కానీ.. విదేశాలపై ఆధారపడటమే మన ప్రధాన శత్రువు అని వ్యాఖ్యానించారు. హెచ్–1బీ వీసాల దరఖాస్తు రుసుమును అమెరికా లక్ష డాలర్లకు పెంచుతున్నట్లు–ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మోదీ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించు కున్నాయి. నేడు భారత్ విశ్వబంధు స్ఫూర్తితో ముందుకుసాగుతోంది. ప్రపంచంలో మనకు ప్రధాన శత్రువులు ఎవరూ లేరు. మన అతిపెద్ద శత్రువు ఇతరదేశాలపై ఆధారపడటమే. దీన్ని మనం ఓడించాలి. విదేశాలపై ఎక్కువగా




ఆధారపడితే.. దేశ అభివృద్ధి విఫలమవుతుంది. ప్రపంచ శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు కోసం అత్యధిక జనాభా కలిగిన దేశం ఆత్మనిర్భర్‌గా మారాలి. ఇతరులపై ఆధారపడితే మన ఆత్మగౌరవం దెబ్బతింటుంది. భారతదేశ అభివృద్ధిని, భావితరాలను పణంగా పెట్టలేం' అని మోదీ పేర్కొన్నారు. ఈసందర్భంగా దేశం భరించాల్సిన నష్టాల్లో షిప్పింగ్ రంగం ఒకటని మోదీ పేర్కొన్నారు. 50 ఏళ్ల క్రితం మన దేశంలో తయారుచేసిన నౌకలనే మనం ఉపయోగించుకొనేవాళ్లమన్నారు. కానీ, కాంగ్రెస్ అధికారం లోకి వచ్చిన తరువాత ఆ రంగం పూర్తిగా నాశనమైందని ఆరోపించారు. వారి ప్రభుత్వ హయాంలో స్వదేశం లో నౌకల తయారీపై దృష్టిపెట్టకుండా విదేశీ నౌకలకు అద్దెలు చెల్లించేందుకే ప్రాధాన్యం ఇచ్చారని విమర్శించారు. అందువల్లే ఇప్పటికీ మన వాణిజ్యంలో 90 శాతం విదేశీ నౌకల పైనే ఆధారపడుతున్నా మన్నారు. ఇందుకుగాను మనం ఏటా రూ.6 లక్షల కోట్లు చెల్లిస్తున్నామని వెల్లడించారు. ఇది దేశ రక్షణ బడ్జెట్ కంటే ఎక్కువన్నారు. దీనికి ముందు భావ్‌నగర్‌లో రూ.34,200 కోట్లకు పైగా

# దసరా సమీపిస్తున్న వేళ.. భారీగా అక్రమ మద్యం పట్టివేత

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: దసరా పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో తెలంగాణ వ్యాప్తంగా మద్యం అక్రమ రవాణాపై ఎక్సైజ్ అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ప్రత్యేక తనిఖీల్లో రంగారెడ్డి, హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో పెద్దఎత్తున నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్ స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 585 బాటిళ్లు స్వాధీనం చేసుకోగా, వాటి విలువ సుమారు రూ.21.80 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ జీవన్ కిరణ్ ఆధ్వర్యంలో పహాడీషరీఫ్ వద్ద వాహనాల తనిఖీల్లో గోవా, ఢిల్లీ, హరియాణా నుంచి మద్యం తీసుకువస్తున్న వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఒక్కొక్కరు 10 నుంచి 15 బాటిళ్లను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. ఈ తనిఖీలో 449 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నామని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ డీటీఎఫ్ అధికారులు ధూల్‌పేట్‌లోని ఓ ఇంటిపై దాడి చేసి 72 సీసాలు పట్టుకున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీపంలో తనిఖీలు జరిపి 47 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. నాంపల్లి పిస్తా హౌజ్ ప్రాంతంలో దాడి చేసి 136 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. వాటి విలువ రూ.6.80 లక్షలు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అక్రమ రవాణా వల్ల తెలంగాణ ఎక్సైజ్ ఆదాయానికి నష్టం వాటిల్లుతుందని, దసరా వరకు ప్రత్యేక దాడులు కొనసాగుతాయని ఎక్సైజ్ అధికారులు హెచ్చరించారు.

# హెచ్-1బీ వీసా కొత్త నిబంధనలు.. భారత్ ఏమన్నదంటే..!



హెచ్–1బీ వీసాకు సంబంధించి అమెరికా కొత్త నిబంధనలపై భారత్ స్పందించింది. ఇది ఇరు దేశాల్లో సంస్థలను ప్రభావితం చేయడంతోపాటు ఎన్నో కుటుంబాలకు ఇబ్బందికర అంశమని పేర్కొంది. వీటి పరిణామాలను సంబంధిత భారత సంస్థలు సహా భాగస్వామ్య పక్షాలన్నీ అధ్యయనం చేస్తున్నాయని తెలిపింది. ఇప్పటికే ప్రాథమిక విశ్లేషణల ఆధారంగా కొన్ని ఊహాగానాలపై స్పష్టతనిచ్చే ప్రయత్నం చేశాయని భారత విదేశాంగశాఖ ఓ ప్రకటన విడుదల చేసింది.

భారతీయులకు పిడుగులాంటి వార్త.. హెచ్–1బీ వీసాదరఖాస్తు రుసుం లక్ష డాలర్లు ఆవిష్కరణలు, సృజనాత్మకత వంటి అంశాల్లో రెండు దేశాల్లోని సంస్థలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని భారత్ పేర్కొంది. నిపుణుల రాకపోకల వల్ల సాంకేతిక, ఆవిష్కరణలు, పోటీతత్వం, ఆర్థిక వృద్ధితోపాటు సంపద సృష్టితో ఇరు దేశాలు పరస్పర లబ్ధి పొందాయని తెలిపింది. అయితే, ప్రస్తుతం అమెరికా నిర్ణయంతో ఎన్నో కుటుంబాలకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అభిప్రాయపడింది. ఇరుదేశాల ప్రజలతో ముడిపడిన అంశంపై జాగ్రత్తగా నిర్ణయాలు తీసుకోవాలని,

# రేవంత్‌రెడ్డికి కిషన్‌రెడ్డి ఫోబియా..: రామచందర్‌రావు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి ప్రతిసారి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని నిందించడం మానుకోవాలని భాజపా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. మీడియాతో చిట్‌చాట్‌గా ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డికి భాజపా ఫోబియాతో పాటు కిషన్‌రెడ్డి ఫోబియా కూడా అంటుకుందని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలకు కేంద్ర ప్రభుత్వం ఏం చేస్తుందని ప్రశ్నించారు. ఉద్యోగులకు జీతాల డబ్బులు ఇవ్వలేని రేవంత్ రెడ్డి యూనివర్సిటీకి వెయ్యి కోట్లు ఎలా ఇస్తారని నిలదీశారు."విద్యా వ్యవస్థ పూర్తిగా దుర్భర పరిస్థితుల్లోకి వెళ్లింది. రేవంత్ రెడ్డికి ఢిల్లీకి వెళ్లడమే సరిపోతోంది. శ్యామ్ పిట్రోడా ట్రైనింగ్ ఇవ్వడం వల్లే రాహుల్ గాంధీ అలా తయారయ్యారు. ఓట్ల చోరీ అనే కొత్త నాటకాన్ని తెరమీదకు తెచ్చి దేశ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. బోగస్ ఓట్లు వేరు.. ఓట్ల చోరీ వేరు. ఈ చిన్న విషయం కూడా తెలియని రాహుల్ గాంధీ ఓట్ల చోరీ అంటారు.. హైడ్రోజన్ బాంబ్ అంటారు.. ఇంకేదో అంటున్నారు. ఎన్డీఎస్ఏ ఇచ్చిన రిపోర్ట్ ప్రకారమే కాళేశ్వరంపై పీసీ ఘోష్ విచారణ చేపట్టింది. కమిషన్ విచారణలో నిందితులు ఎవరన్నది తేల్చిందా? రాజకీయ నేతలను ఎవరినైనా అరెస్ట్ చేశారా?" అని రామచందర్‌రావు ప్రశ్నించారు.

# రహదారి భద్రత పేరిట ప్రజలపైభారమా

మొదటి పేజీ తరువాయి

రహదారి భద్రతా సెస్ పేరిట ఒక్కో కొత్త వాహనం కొనుగోలుపై ఏకంగా రెండు నుంచి పదివేల వరకూ అదనపు భారం వేయడం పేద, మధ్యతరగతికి చెందిన ప్రజానీకాన్ని దగా చేయడమే అని నిప్పులు చెరిగారు. రెండేళ్లు కావస్తున్నా ఇవ్వాల్సిన గ్యారెంటీ–లను గాలికొదిలేసి, చివరికి ప్రజల నుంచే ముక్కుపిండి రూ.270 కోట్లు– వసూలు చేసే కుట్రచేస్తే కాంగ్రెస్ సర్కారును ప్రజలు క్షమించరు. పైసా పైసా కూడబెట్టు–కుని, అప్పు చేసి మరీ వాహనం కొనుగోలు చేసే వారి జేబులు కొట్టే ఇలాంటి పన్నాగాలకు కాంగ్రెస్ సర్కారు ఇకనైనా స్వస్తి పలకాలి అని కేటీఆర్ పేర్కొన్నారు.

# రాజకీయాల్లో ఎవరూ స్పేస్ ఇవ్వరు.. తొక్కుకుంటూ వెళ్లాల్సిందే: కవిత

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: కాంగ్రెస్‌లోకి వెళ్లాలన్న ఆలోచన తనకు లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. "కాంగ్రెస్ పెద్దలు ఎవరూ నన్ను సంప్రదించలేదు. సీఎం ఎందుకలా అంటున్నారో తెలియదు.. భయపడుతున్నారేమో? కాళేశ్వరం అంశంలో తప్ప హరీశ్‌రావుపై నాకు వేరే కోపం లేదు. ఇరిగేషన్‌పై 2016లోనే కేటీఆర్‌కు సూచించాను. నేరుగా సీఎంకే ఫైళ్లు వెళు తున్నాయని కేటీఆర్‌కు చెప్పా. కిందిస్థాయి కమిటీ పరిశీలన, ఆమోదం లేకుండానే సీఎంకు ఫైళ్లు వెళ్లాయి. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక చూస్తే అన్నీ అర్థమవుతాయి. రాజకీయ పార్టీ ఏర్పాటుపై ఇంకా ఆలోచించలేదు. రాజకీయాల్లో ఎవరూ స్పేస్ ఇవ్వరు.. తొక్కుకుంటూ వెళ్లాల్సిందే.

సుప్రీంకోర్టు స్టే ఉన్నప్పటికీ ఆల్మట్టి ఆనకట్ట ఎత్తు పెంచేందుకు కర్ణాటక సిద్ధమైంది. ఆల్మట్టిపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లాలి. ప్రభుత్వం వెళ్లకుంటే జాగృతి తరఫున మేము సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం. మహారాష్ట్ర ఇప్పటికే స్పందించి కోర్టును ఆశ్రయిస్తామని ప్రకటించింది. ఆల్మట్టి ఎత్తు పెంచితే కృష్ణా నదిలో క్రికెట్ ఆడుకోవడం తప్ప ఏమీ ఉండదు. పదేళ్లలో ఆర్డీఎస్, తుమ్మిళ్ల, పాలమూరు–రంగారెడ్డి పూర్తి చేసుకోలేకపోయాం. సీఎం రేవంత్‌రెడ్డి కూడా కృష్ణా ట్రైబ్యునల్ విచారణకు వెళ్లాలి. భారత రాష్ట్ర సమితి పార్టీ, హరీశ్‌రావు, సంతోష్ సోషల్‌మీడియాలు నాపైనే దాడి చేస్తున్నాయి. నాపై దాడిని ప్రజలు గమనిస్తున్నారు. బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే నిరసనలు తెలుపుతాం. ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేశా.. ఆమోదించాలని మండలి ఛైర్మన్‌ను కోరా. ప్రజాస్వామ్యంలో ఎన్ని పార్టీలు ఉంటే అంత మంచిది. కొత్త పార్టీలు వస్తే స్వాగతిస్తాం. ఆదివారం చింతమడకలో జరిగే బతుకమ్మ వేడుకల్లో పాల్గొంటా" అని కవిత తెలిపారు.

# శ్రీలంక తమిళులకు ఆయన గొంతుగా నిలిచాడు.. విజయ్ వివాదాస్పద వ్యాఖ్యలు




తమిళ నటుడు, తమిళగ వెట్రి కళగం పార్టీ వ్యవస్థాపకుడు విజయ్ శ్రీలంక తమిళుల అంశాన్ని లేవనెత్తారు. వారికి ఎల్‌టీటీఈ ప్రభాకరన్ ప్రేమ చూపించాడని అన్నారు. నాగపట్టణంలో కార్యకర్తలతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. "ఈలం తమిళులు శ్రీలంకలో ఉన్నా.. ప్రపంచంలో మరేచోట ఉన్నా.. గొప్ప నాయకుడిని కోల్పోయి బాధపడుతున్నారు. వారికోసం మన గళాన్ని వినిపించాల్సిన అవసరం ఉంది" అని విజయ్ అన్నారు. ఎల్‌టీటీఈ ప్రభాకరన్‌గా గుర్తింపు పొందిన వేలుపిళ్లై ప్రభాకరన్‌ను ఉద్దేశించి ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శ్రీలంక తమిళులకు అనుకూలంగా విజయ్ మాట్లాడటం ఇదే తొలిసారి కాదు. 2008లో ఆ దేశంలో తమిళుల హత్యకు నిరసనగా చెన్నైలో జరిగిన నిరాహార దీక్షలో ఆయన పాల్గొన్నారు. ఎన్నికల వేళ.. తమిళనాడు రాజకీయాల్లో ఈ అంశం కూడా కనిపిస్తుంటుంది. ఆ రాష్ట్రంలో మరీ ముఖ్యంగా నాగపట్టణంలోని మత్స్యకారుల్లో ఇదొక భావోద్వేగపూరిత అంశం. "మత్స్యకారుల సమస్య గురించి సుదీర్ఘ లేఖ రాసి, ఆపై మౌనంగా ఉండే డీఎంకే ప్రభుత్వం లాంటి వాళ్లం మేము కాదు. వారి సమస్యకు పరిష్కారం కొనడం మా కీలక అజెండాలలో ఒకటి. మన జాలర్లపై శ్రీలంక నావికా దళ దాడులకు గల కారణాలు, పరిష్కారాలపై నేను మదురై సమావేశంలో మాట్లాడాను. వారికి అండగా నిలబడటం మా కర్తవ్యం" అని పేర్కొన్నారు. ఇదిలాఉంటే.. భారత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీని 1991 మే 21న చెన్నైకి సమీపంలోని శ్రీ పెరంబుదూరు వద్ద ఎల్‌టీటీఈ బృందం మానవ బాంబు ప్రయోగించి హతమార్చింది. రాజీవ్‌గాంధీ హత్యకు కుట్రచేసి, అమలు చేసిన ప్రభాకరన్‌ను విజయ్ ప్రశంసించడం చర్చనీయాంశంగా మారింది.

# బోడుప్పల్ సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శ్రీకారం



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
బోడుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ డివిజన్ ద్వారకానగర్ ఫేజ్-2లో సీసీ రోడ్ల నిర్మాణ పనులు శనివారం ప్రారంభమయ్యాయి. మాజీ కార్పొరేటర్ శ్రీ బింగి జంగయ్య యాదవ్ గారు కొబ్బరికాయ కొట్టి పనులకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో ద్వారకానగర్ కమిటీ సభ్యులు, స్థానిక కాలనీ ప్రజలు పాల్గొని హర్షం వ్యక్తం చేశారు.

# ఘట్కేసర్ హాస్టల్ లో ఉరేసుకొని డిప్లొమా విద్యార్థిని ఆత్మహత్య



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
రాచకొండ కమిషనరేట్ ఘట్కేసర్ పరిధిలో డిప్లొమా విద్యార్థిని (17) ఆత్మహత్య చేసుకుంది. సూర్యాపేటకు చెందిన ఆమె ఘట్కేసర్‌లోని ఇంజనీరింగ్ కాలేజీలో చదువుతోంది. శుక్రవారం భోజనం అనంతరం హాస్టల్ గదిలోకి వెళ్లి తిరిగి రాకపోవడంతో తోటి విద్యార్థులు వెళ్ళి చూడగా లోపల బేడం వేసుకుని ఉరివేసుకున్నట్టు కనిపించింది. ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందింది. ఘట్కేసర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# శ్రీరంగవరం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



## - బతుకమ్మ సంబరాలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా ఎల్లంపేట్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరంగవరం గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో హెడ్ మిస్ట్రెస్ సుజాత ఆధ్వర్యంలో తల్లిదండ్రుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పిల్లల చదువు, తల్లిదండ్రుల బాధ్యతలు, పాఠశాలలోని సదుపాయాలపై చర్చించారు. అనంతరం పిల్లలతో కలిసి బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మిస్ట్రెస్ సుజాత, ఉపాధ్యాయులు వాణి, సుమతీ, సంధ్యా, ఫారజానా, అరుణ, సంతోష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# భార్య గొంతు కోసి పరారైన భర్త



**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుషాయిగూడలో దారుణ ఘటన చోటు చేసుకుంది. బంధువుల ఇంట్లో ఉన్న భార్యను భర్త గొంతు కోసి హతమార్చాడు. మంజుల, శంకర్ దంపతులు ముంబై నుంచి హైదరాబాద్‌కు రెండు నెలల క్రితమే వలస వచ్చారు. కాగా మంజుల వివాహేతర సంబంధం పెట్టుకుందన్న అనుమానంతో భర్త శంకర్ ఆమెతో తరచూ గొడవలు పెట్టుకునేవాడు. ఈ క్రమంలో బంధువుల ఇంట్లో ఉన్న భార్యను కిరాతకంగా హతమార్చి పరారయ్యాడు. పోలీసులు నిందితుడి కోసం గాలిస్తున్నారు.

# మందుల దుకాణాల్లో డ్రగ్ ఇన్స్పెక్టర్ తనిఖీలు

## - కోరుట్లలో డ్రగ్ ఇన్స్ పెక్టర్ తనిఖీలు

**కొండబత్తిని అమర్ నాథ్, కోరుట్ల ప్రతినిధి**
కోరుట్ల పట్టణంలోని పలు ఔషధ దుకాణాలపై జిల్లా డ్రగ్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలోని మెడికల్ షాపులలో తనిఖీలు చేసి, కొన్ని మందుల నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించారు. అర్హత కలిగిన వైద్యుల చీటీ మేరకే మందులు అమ్మాలని సూచించారు. తనిఖీల్లో పలు రికార్డులను పరిశీలించారు.



# ఫోకస్ ఫోటో అసోసియేషన్ - 20 ఏళ్ల వేడుకలు




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా కాప్రాలో ఫోకస్ ఫోటో అసోసియేషన్ (FPGA) తన 20వ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంది. 2005లో స్థాపించబడిన ఈ సంస్థ, గత రెండు దశాబ్దాలుగా తెలుగు రాష్ట్రాల ఫోటోగ్రాఫర్లకు సేవలందిస్తూ, అనేక శిక్షణా శిబిరాలు, ఫోటో పోటీలు, సృజనాత్మక కార్యక్రమాలను నిర్వహించింది. ఈ సందర్భంగా, అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫోటోగ్రాఫర్లకు క్రికెట్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ వేడుకల్లో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

# సూక్ష్మ అర్థశాస్త్రం పుస్తకావిష్కరణ:

## - మార్కెట్ మార్పులకు అనుగుణంగా కొత్త అంశాలు చేర్పు




**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో శనివారం మార్కెట్లో వస్తున్న మార్పులకు అనుగుణంగా సూక్ష్మ అర్థశాస్త్రంలో ప్రభుత్వం కొత్త మార్పులు తీసుకువస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ కే వేంకయ్య తెలిపారు. 'పునరుద్ధరించబడిన సూక్ష్మ అర్థశాస్త్రం' అనే తెలుగు మీడియం పుస్తకాన్ని కళాశాల సిబ్బంది ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కృత్రిమ మేధస్సు, డిజిటల్ మార్కెటింగ్ వంటి ఆధునిక మార్పుల నేపథ్యంలో సూక్ష్మ అర్థశాస్త్రంలోనూ వీటికి సంబంధించిన అంశాలను కొత్తగా చేర్చినట్లు ఆయన పేర్కొన్నారు.

# కథలాపూర్ ఆరోగ్య కేంద్రంలో - స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్

**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కథలాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, ఆయుష్మాన్ మందిర్ లో శనివారం నాడు మహిళలు, కిశోర బాలికలు, పిల్లల సంపూర్ణ ఆరోగ్యం కోసం 'స్వస్త్ నారి స్వశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమాన్ని మండల ప్రజాపరిషద్ అభివృద్ధి అధికారి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా గైనకాలజిస్ట్ డా. విజయలక్ష్మి మహిళలకు, గర్భిణీ స్త్రీలకు పరీక్షలు నిర్వహించారు. వైద్యాధికారి డా. సింధూజ పోషకాహారంపై అవగాహన కల్పించారు. పిల్లలకు టీకాలు వేసి, ఎదుగుదలకు సూచనలు అందించారు. మహిళలకు మధుమేహం, రక్తపోటు వంటి పరీక్షలు చేసి చికిత్స, మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# అయిలాపూర్ అంగన్వాడీలో - ఘనంగా బతుకమ్మ వేడుకలు



**కొండబత్తిని అమర్ నాథ్, కరపత్రం కోరుట్ల**
కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలోని అంగన్వాడీ పాఠశాలలో ఉపాధ్యాయురాలు పిప్పోజి సుజాత ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. పిల్లలు పాఠశాల పరిసరాల నుండి పూలను సేకరించి బతుకమ్మను పేర్చి, దాని చుట్టూ తిరుగుతూ కోలలతో నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సహాయకురాలు బాధ విజయ, మరియు పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బతుకమ్మ సంబరాలు - మెటుపల్లి, ఇబ్రహీంపట్నం మండల గ్రామాల్లో ఉత్సవాలు

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం మెటుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పటణం, ఇబ్రహీంపట్నం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో శనివారం తెలంగాణ సంస్కృతి సాంప్రదాయం పండుగ బతుకమ్మ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పాఠశాలల్లో బతుకమ్మలను ఏర్పాటు చేసి ఆటపాటలు ఆడి సమీపంలోని చెరువులు, కుంటలలో నిమజ్జనం చేసి వేడుకలు నిర్వహించారు.



# రాజన్నను దర్శించుకున్న జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్





**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
తెలంగాణ రాష్ట్ర జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా శనివారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి చేరుకోగానే ఆమెకు అర్చకులు, వేదపండితులు స్వస్తితో స్వాగతం పలికారు. అనంతరం కళ్యాణ మండపంలో వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేసి,స్వామివారి శేషవస్త్రం, అమ్మవారి వస్త్రంతో పాటు లడ్డూ ప్రసాదాన్ని అందజేశారు. ఆమె వెంట జైళ్ల శాఖ డిఐజి సంపత్,రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతే, వేములవాడ అడిషనల్ ఎస్పీ శేషాద్రిని రెడ్డి, పట్టణ ఎస్ఐలు చల్లా వెంకట్రాజం, ఎల్లాగౌడ్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ సముద్రాల రాజు, ఆలయ ఎస్పీఎఫ్ ఎస్ఐ మహేందర్, పర్యవేక్షకులు నూగురి నరేందర్, సీనియర్ అసిస్టెంట్ బొడుసు మహేష్,జూనియర్ అసిస్టెంట్ సింహాచారి, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# వేదం ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ సంబరాలు.

**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 20**






రాంనగర్ లోని వేదం ఉన్నత పాఠశాలలో ముందస్తు బతుకమ్మ ఉత్సవాలు చాలా ఘనంగా జరిగాయి. విద్యార్థిని విద్యార్థులు రంగురంగుల పూలతో బతుకమ్మలు పేర్చుకొని తెలుగుతనం ఉట్టిపడే సాంప్రదాయమైన బట్టలు ధరించి ఎంతో ఉత్సాహంతో ఉల్లాసంతో ఆటపాటలతో పాఠశాల పరిసరాలను పండగ వాతావరణంతో నింపేశారు. పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ బొమ్మ శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఇది ప్రకృతి, పూలు, స్త్రీ శక్తిని కీర్తించే పండుగ అని బతుకు అమ్మ బతుకు అంటే జీవనం, అమ్మ అంటే తల్లి. అంటే జీవనాన్ని కాపాడే తల్లి అనే అర్థం వస్తుందని విద్యార్థిని విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు పాల్గొని ఈ కార్యక్రమం అన్ని విజయవంతం చేశారు.

# విజన్ హై స్కూల్ లో అంగరంగ వైభవంగా బతుకమ్మ సంబరాలు



**కరపత్రం ప్రతినిధి కరీంనగర్ సెప్టెంబర్ 20**
కరీంనగర్ లోని విజన్ హై స్కూల్ లో ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థినీ విద్యార్థులు వివిధ రకాల రంగురంగుల పూలను తీసుకొచ్చి బతుకమ్మలు పేర్చి బతుకమ్మ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు వివిధ రకాల నృత్యాలు, బతుకమ్మ ఆటలు ఆడి ముందస్తుగా బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ సిరిపురం ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ ఆడపడుచులు ఈ పూల పండుగను ఎంతగానో వైభవంగా, ఘనంగా నిర్వహించుకుంటారు. అందులో భాగంగా ఈరోజు మన స్కూల్లో ఈ ఈ పండగ యొక్క సంస్కృతినీ, సాంప్రదాయాలను విద్యార్థులందరికీ వివరించడం జరిగింది. విద్యార్థిని, విద్యార్థులకు , తల్లిదండ్రులకు ఉపాధ్యాయుని ఉపాధ్యాయులకు అందరికీ ముందస్తుగా బతుకమ్మ , దసరా శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది . ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సందవేణి వెంకట్ , ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

# మెట్ పల్లిలో పారిశుద్ధ్య పనులు మున్సిపల్ కమిషనర్ టి. మోహన్

**గాజెంగి మహేశ్వర్, కరపత్రం ప్రతినిధి**
జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో శనివారం స్వచ్ఛోత్సవ్ స్వచ్ఛత హీసేవ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పార్కులో పారిశుద్ధ్య పనులలో మున్సిపల్ కమిషనర్ టి. మోహన్ పాల్గొన్నారు. కమిషనర్ మాట్లాడుతూ, బాబాసాహెబ్ అంబేద్కర్ పార్కులో గడ్డి, చెట్లను కటింగ్ చేస్తూ సర్వ సుందరంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. పట్టణ ప్రజలు స్వచ్ఛందంగా పరిసరాలను శుభ్రం చేసుకోవాలన్నారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని, ఇందుకు ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.



# కాంగ్రెస్ పార్టీ పైన మండిపడ్డ బిజెపి జిల్లా అధ్యక్షుడు రాధా వాళ్లదాస్ మల్లేష్ గౌడ్.

**కరపత్రం ప్రతినిధి దినపత్రిక మెదక్ నర్సాపూర్**
మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో బిజెపి కార్యాలయంలో10 నిమిషాలకు ఓసారి కరెంట్ కట్.. కాంగ్రెస్‌పై మండిపడ్డ బీజేపీ గత 12 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ హయాంలో విపరీతమైన కరెంటు కోతలు ఉండేవని, పెద్ద పెద్ద పరిశ్రమల యజమానులు చైనా, జపాన్, రష్యా తదితర దేశాల నుండి లక్షల కోట్లు వెచ్చించి జనరేటర్లు తీసుకువచ్చారని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ మల్లేష్ గౌడ్ 10 నిమిషాలకు ఓసారి కరెంట్ కట్.. కాంగ్రెస్‌పై మండిపడ్డ బీజేపీ నర్సాపూర్ : గత 12



సంవత్సరాల క్రితం కాంగ్రెస్ హయాంలో విపరీతమైన కరెంటు కోతలు ఉండేవని, పెద్ద పెద్ద పరిశ్రమల యజమానులు చైనా, జపాన్, రష్యా తదితర దేశాల నుండి లక్షల కోట్లు వెచ్చించి జనరేటర్లు తీసుకువచ్చారని బిజెపి పార్టీ జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ మల్లేష్ గౌడ్ వెల్లడించారు. శనివారం నర్సాపూర్ పట్టణంలోని బిజెపి కార్యాలయంలో కేంద్ర బిజెపి ప్రభుత్వం తగ్గించిన జిఎస్టి ధరలపై విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు వాళ్దాస్ మల్లేష్ గౌడ్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యుత్తును మెరుగుపరిచిందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఈ మధ్యకాలంలో కురిసిన వర్షాలకు చెరువులు, కుంటలు, చెక్ డ్యాములు, ప్రాజెక్టులు పూర్తిగా నిండాయని, కానీ 10 నిమిషాలకు ఒకసారి కరెంట్ పోతుందని ఎద్దేవా చేశారు. దేశంలోని మిగతా రాష్ట్రాలలో పెట్రోల్ డీజిల్ ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావడం జరిగిందని, తెలంగాణలో మాత్రం కాంగ్రెస్ ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ ను జీఎస్టీ పరిధిలోకి తీసుకురాలేకపోయిందని గుర్తు చేశారు. జీఎస్టీ పరిధిలోకి తీసుకువస్తే నేడు పెట్రోల్ డీజిల్ సుమారు 15 రూపాయల వరకు తగ్గేదని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల గురించి రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిందని, దీనికిగాను కేంద్ర ప్రభుత్వం మొదటి విడత బిల్లుగా ఒక్కో లబ్ధిదారునికి 1.25 లక్షల డబ్బులు రాష్ట్రానికి పంపిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని నాలుగు స్లాబ్ ల నుండి రెండు స్లాబుల వరకు చేయడం జరిగిందని దీనితో సామాన్య ప్రజలకు, వ్యాపారస్తులకు ఉపశమనం లభించిందన్నారు. జిఎస్టి తగ్గడంతో వస్తువులపై, వాహనాలపై, నిర్మాణాలపై భారం తగ్గుతుందని అన్నారు. ఈనెల 22 నుండి జీఎస్టీ తగ్గింపు ధరలు అమలులోకి వస్తుందని వస్తువులు కొనుగోలు చేసేవారు ఈ రెండు రోజులు ఓపిక పట్టాలని సూచించారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రమేష్ గౌడ్, అంజి గౌడ్, అరవింద్ గౌడ్, చంద్రయ్య, సురేష్, చిన్న రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణవేణి విద్యాసంస్థలలో ముందస్తు బతుకమ్మ పండుగ





**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 20:**
విజయదశమి (దసరా) పండుగను పురస్కరించుకొని కృష్ణవేణి విద్యాసంస్థలలో పాఠశాల డైరెక్టర్ మంజుల శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో గౌరమ్మ (బతుకమ్మ)ను పాఠశాల ప్రాంగణంలో అన్ని రకాల పూలతో అలంకరించి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంజుల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈ పండుగ హిందూ ఇతిహాసం అని, రామాయణంలో రాక్షసుడైన రావణుడిపై శ్రీరాముడు సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకుంటారన్నారు. దసరా అంటే చెడుపై మంచి సాధించిన విజయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు, పోషకులు, విద్యార్థినీలు గుంపులు గుంపులుగా ఏర్పడి బతుకమ్మ ఆటపాటలతో ఎంతో ఉత్సాహంతో ఉల్లాసంగా కార్యక్రమాన్ని నిర్వహించారు.

## ఎన్ హెచ్ ఆర్ సి. కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా ఇటిక్యాల స్వరూప

- నియామక పత్రం అందించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య
- కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడి ప్రణయ్



**కరపత్రం ప్రతినిది జమ్మికుంట (కరీంనగర్ జిల్లా):**
జాతీయ మానవ హక్కుల కమిటీ (ఎన్ హెచ్ ఆర్ సి) కరీంనగర్ జిల్లా అధికార ప్రతినిధిగా జమ్మికుంటకు చెందిన ఇటిక్యాల స్వరూపను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య నియామక పత్రం అందించారని కరీంనగర్ జిల్లా అధ్యక్షులు ఇమ్మడి ప్రణయ్ తెలిపారు. పేద ప్రజల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఏర్పడిన జాతీయ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధిగా నియామకమైన ఇటిక్యాల స్వరూప మాట్లాడుతూ తమపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మొగుళ్ళ భద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు, న్యాయవాది సుంకనపల్లి రాము, రాష్ట్ర కమిటీ సభ్యులు పృథ్వీరాజ్, హరీష్, రాజశేఖర్, అరవిందరెడ్డి, తిరుపతి, రాజేశం, జిల్లా అధ్యక్షులు ప్రణయ్, జగిత్యాల జిల్లా అధ్యక్షులు కాసారపు శ్రీనివాస్ గౌడ్, జిల్లా మీడియా కన్వీనర్ రాచర్ల వేణు తదితరులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. తనకిచ్చ

## ఉషోదయ హైస్కూల్ లో ముందస్తు బతుకమ్మ వేడుకలు



**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 20:**
గోదావరిఖనిలోని రమేష్ నగర్ ప్రాంతంలోని ఉషోదయ హైస్కూల్ లో ముందస్తు బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా పాఠశాలలోని విద్యార్థులందరూ సాంప్రదాయ దుస్తులు ధరించి రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి వారి ఆటపాటలతో చూపరులను అలరించారు. సంబరాల్లో పాఠశాల కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శైలజ, శ్రీలక్ష్మి, భార్యలక్ష్మి, ఎడ్విన్ తో పాటు ఉపాధ్యాయినీలు పాల్గొన్నారు.

## వేముల అశోక్ కు ప్రతిష్టాత్మక అవార్డు..



- ప్రముఖ సినీ తారల చేతుల మీదుగా ప్రదానం

**కరపత్రం ప్రతినిధి గోదావరిఖని సెప్టెంబర్ 20:**
గోదావరిఖనికి చెందిన యూట్యూబ్ స్టార్, సీనియర్ కళాకారుడు, సామాజిక కార్యకర్త వేముల అశోక్ ను ప్రతిష్టాత్మక గ్రేటర్ ఎక్స్ లెన్సీ- 2025 అవార్డు వరించింది. హైదరాబాద్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రముఖ సినీ ప్రముఖులు, తారల చేతుల మీదుగా అశోక్ కు ఆవార్డు ప్రదానం చేశారు. ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో తెలుగు రాష్ట్రాలలో కళారంగాలలో విశిష్ట ప్రతిభ కనబరుస్తున్న పలువురిని అవార్డుకు ఎంపిక చేసింది. దీనిలో భాగంగా గోదావరిఖనికి చెందిన వేముల అశోక్ నటనా రంగంలో ఆసక్తితో ఇప్పటివరకు దాదాపు 80 వరకు సందేశాత్మక షార్ట్ ఫిలింలను తీశారు. వీటిలో ప్రజాదరణ పొందిన చిత్రాలు ఎన్నో ఉన్నాయి. అలాగే ప్రైవేటు వీడియో ఆల్బమ్ లు కూడా చిత్రీకరించారు. బుల్లి తెరపై అశోక్ కళా ప్రతిభను గుర్తించిన ఎఫ్ టీపీఏ- ఇండియా శనివారం నాడు హైదరాబాద్ లో ని కంట్రీ క్లబ్ లో జరిగిన ఈవెంట్ లో గ్రేటర్ ఎక్స్ లెన్సీ అవార్డుతో సన్మానించింది. ఎఫ్టీపీఏ ఇండియా ప్రతినిధులు చైతన్య జంగా, వీఎస్ వర్మ, కిరణ్ బేజాడీ, చంద్రశేఖర్తోపాటు ప్రముఖ సినీ తారలు అశోక్ ను ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్ లో మరిన్ని సందేశాత్మక చిత్రాలను నిర్మించాలని సూచించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ కళారంగంపై ఆసక్తితో షార్ట్ ఫిలింలు తీస్తున్నాననీ, కానీ, హైదరాబాద్ వేదికగా సినీ ప్రముఖుల సరసన అవార్డు తీసుకునే భాగ్యం కలుగుతుందని ఊహించలేదని పేర్కొన్నారు. తన చిత్రాలను ఆదరిస్తున్న ప్రేక్షకాభిమానులకు ఈ అవార్డును అంకితం చేస్తానని పేర్కొన్నారు. కాగా, గ్రేటర్ అవార్డుతో గోదావరిఖనికి పేరు తీసుకవచ్చిన అశోక్ ను స్థానిక కళాకారులు అభినందించి హర్షం వ్యక్తం చేశారు.

## రాజన్న ఆలయ అభివృద్ధి పనుల పరిశీలనకు రండి

- శృంగేరి జగద్గురు, శృంగేరి పీఠాధిపతులను ఆహ్వానించిన ప్రభుత్వ విప్
- తప్పకుండా వస్తామని ఆశీస్సులు అందించిన స్వాములు

**కరపత్రం ప్రతినిధి వేములవాడ**
దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి పనులను పరిశీలించడానికి శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి, శృంగేరి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి స్వాములను రావలసిందిగా రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ కోరారు. తెలంగాణ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో జరుగుతున్న పనుల తీరుతెన్నులు,ప్రగతి వివరాలను ఆది శ్రీనివాస్, రాజన్న ఆలయ ఈవో,ఆలయ బృందంతో కలిసి శనివారం శృంగేరి జగద్గురు శ్రీశ్రీశ్రీ భారతి తీర్థ మహాస్వామి,పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతి



స్వాములను కలిసి వివరించి, రాజన్న ఆలయానికి విచ్చేయవలసిందిగా ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ శ్రీ రాజరాజేశ్వర స్వామి క్షేత్ర విస్తరణ అభివృద్ధిలో భాగంగా స్వామివారి విజయ యాత్రను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర పర్యటన ఉన్నందున స్వామివారులను వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి సన్నిధికి రావాల్సిందిగా ఆహ్వాన పత్రికను అందజేశామని,ఇట్టి ఆహ్వానాన్ని మన్నించి వారి



ఆశీస్సులను అందజేసి రాజన్న క్షేత్రానికి వచ్చే మాసంలో స్వామివారులు తప్పకుండా వస్తానని వారి ఆశీస్సులను అందజేసినట్లు ఆయన తెలిపారు. అనంతరం ప్రభుత్వ విప్,రాజన్న ఆలయ బృందం శృంగేరి లోని శ్రీ శారద అమ్మవారిని దర్శించుకొని తుంగభద్ర నదిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట రాజన్న ఆలయ ఈవో ఎల్. రమాదేవి, ఆలయ ఇంచార్జ్ స్థానాచార్యులు నమిలికొండ ఉమేష్ శర్మ, చంద్రగిరి శరత్, శృంగేరి తెలంగాణ రాష్ట్ర బాధ్యులు రాధాకృష్ణ శర్మ ఉన్నారు.

## రొంపికుంటలో మెగా వైద్య శిబిరం

**కరపత్రం ప్రతినిధి జ్యోతి నగర్ (రామగుండం), సెప్టెంబర్ 20:**



జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమం స్వాత్ నారి సశక్తి పరివార్ అభియాన్ కింద ఎన్టీపీసీ ధన్వంతరి ఆసుపత్రి బృందం, సీఎస్ఆర్ అధికారులతో కలిసి సీఎంవో డాక్టర్ లహ్రి నేతృత్వంలో రొంపికుంట గ్రామంలో మహిళా స్పెషలిస్ట్ డాక్టర్లచే శనివారం మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ శిబిరంలో గైనకాలజిస్ట్ డాక్టర్ అర్చనా జామ్వాల్, ఫిజిషియన్ డాక్టర్ సోమ్య, నేత్ర వైద్యురాలు డాక్టర్ పూజ, సర్జన్ డాక్టర్ జ్వాల, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ శ్రీమతి సవీనా తదితరులు పాల్గొన్నారు. రక్తహీనత, డయాబెటిస్, రక్తపోటు, వక్రీభవన లోపాలు, గుండె జబ్బుల కోసం మహిళా రోగులకు స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. హెచ్.బీ పరీక్ష, రక్తంలో మధుమేహ పరీక్ష, రక్తపోటు పరీక్షలు చేశారు. జనన పూర్వ తల్లుల నివారణ తనిఖీ, విజువల్ అక్యూటీ పరీక్షలు చేశారు. ఆరోగ్యకరమైన ఆహారం, రక్తహీనత నివారణ, గైనెక్ క్యాన్సర్ల స్క్రీనింగ్ పై స్పెషలిస్ట్ వైద్యులు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో 135 మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందారు. ఉచిత వైద్యం, మందులు, కళ్ళద్దాలను అవసరమైన వారికి అందజేశారు. ఎన్టిపిసి ఈడీ చందన్ కుమార్ సామంత, ఏజీఎం బిజోయ్ కుమార్ సిక్దార్ , సీఎంవో డాక్టర్ లహ్రి, అధికారి వేముగంటి యుగేందర్ రావు, సీఎస్ఆర్ సీనియర్ అధికారులు, గ్రామ సర్పంచి ఈ శిబిరానికి హాజరయ్యారు.

## గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ లో ముగ్గులు వేసి చెత్త వేయకుండా ఏర్పాట్లు..

- మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ అయాజ్

**కరపత్రం ప్రతినిధి జమ్మికుంట సెప్టెంబర్ 20**



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా శనివారం జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని రాజరాజేశ్వర రెసిడెన్స్ సమీపంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ ను చెత్త వేయకుండా ముగ్గులు వేసి చెత్త వేయ కూడదని తెలిపినారు. ఈ సందర్భంగా కమిషనర్ మహమ్మద్ అయాజ్ మాట్లాడుతూ ప్రతి నిత్యం ప్రతి వార్డుకు నిత్యం సుపర్ క్యారీ వ్యాన్లు, ట్రాక్టర్లు, ప్రతి రోజు వార్డులకు వస్తాయని, కానీ ప్రజలు గమనించక చెత్తను వేస్తూ, పర్యావరణాన్ని పాడుచేస్తున్నారని ఆయన అన్నారు. అందుకు మున్సిపల్ పారిశుధ్య కార్మికులు చెత్త తొలగించి, ముగ్గులు వేసి, చెత్త వేయాకుండ గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ వద్ద చెత్త చేయకూడదు అని బోర్డ్ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు మున్సిపల్ పారిశుధ్య సిబ్బంది సిపాయిలుగా పని చేస్తున్న చెత్తను రోడ్లపై వేయడం వల్ల పర్యావరణం కాలుష్యం అయి, సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు గమనించి, చెత్తను మున్సిపల్ వాహనానికి అందించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ జి రాజిరెడ్డి, శానిటరీ ఇన్స్ పెక్టర్ మహేష్, సదానందం, ఈ ఈ శ్రీకాంత్, బిల్ కలెక్టర్లు మొగిలి,శివ, తిరుపతి, శివక్షుమర్, పరిశుధ్య సిబ్బంది పలువురు పాల్గొన్నారు.